క్లుప్తంగా

దసరా శుభాకాంక్షలు తెలిపిన దద్దాల


దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్‌ దద్దాల నారాయణ యాదవ్‌ దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించుకునే దసరా (విజయదశమి) పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. దుర్గా మాత ఆశీస్సులతో ప్రతి ఇంటా మంచి జరగాలని, విజయాలు సిద్ధించాలని, అందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌ సీపీ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

స్వీపర్‌ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నలూరు: మండలంలోని మాలపాడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల్లో ఖాళీగా ఉన్న స్వీపర్‌ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ రవిచంద్రబాబు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 15ను లోపు పొన్నలూరు లోని ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కనిగిరి రూరల్‌: సీజనల్‌ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్‌ చైర్మన్‌ ఎస్‌కే అబ్దుల్‌ గఫార్‌ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని దేవాంగ నగర్‌, టకారి పాలెం ఏరియాల్లో ఆయన పర్యటించారు. ప్రజలకు పలు సూచనలు చేశారు.

నేరస్తులతో జాగ్రత్త

హనుమంతునిపాడు: సైబర్‌ నేరగాళ్లు, దొంగలు, పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.మాధవరావు సూచించారు. శుక్రవారం దాసరిపల్లి, కోటతిప్పల, రశీదుపురం గ్రామాల్లో సైబర్‌ నేరాలు, జరుగుతున్న దొంగతనాలు, రోడ్డు ప్రమాదలపై అవగాహన కల్పించారు. పొలాల్లో సోలార్‌ సెట్లు, ట్రాన్స్‌ ఫార్మర్లు, టాటర్‌ పెట్టెలు దొంగతాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజున మహిషాసురమర్దినిగా వల్లూరమ్మ తల్లి భక్తులకి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ పూలతో అలంకరణలు చేశారు, రాత్రికి అమ్మవారిని ఉత్సవ విగ్రహాలపై ఉత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.


కళకళలాడుతున్న కంది పైరు


కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వర్షం మెండుగా.. పంటలు హాయిగా!


సజ్జ పంట పరిశీలన


జోరుగా పొగనాట్లు

- కనిగిరి డివిజన్‌లో 210.6 మి.మీ వర్షపాతం
- నేల పదునెక్కడంతో కళకళలాడుతున్న పంటలు

కనిగిరి రూరల్‌: మండల కేంద్రం కనిగిరి ప్రాంతంలో గత రెండ్రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంటలు కళ కళలాడుతున్నాయి. కనిగిరి వ్యవసాయ సబ్‌ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ప్రధానంగా కంది, వరి, సజ్జ, పొగాకు, మినుము తదితర పైర్లు వేశారు. అధికారిక లెక్కల ప్రకారం కంది 15, 487 హెక్టార్లు, వరి 500 హెక్టార్లు, సజ్జ 1,496 హెక్టార్లు, పొగాకు 400 హెక్టార్లు, మినుము 700 హెక్టార్లు, ఇతర పంటలు 200 హెక్టార్ల వరకు వేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షం కంది, వరి, మినుము పంటలు మంచి మేలు చేస్తుంది. పొగనాట్లు మరింత పెరగనున్నాయి. అయితే కోత దశకు వచ్చిన సజ్జకు ఈ వర్షం వల్ల కొంత మేర నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. వర్షం ముసురు మరో రెండ్రోజులు కొనసాగితే సజ్జ గింజలు రాలి పోవడం, రంగుపోవడం వంటి నష్ట పరిణామాలు జరుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెవెన్యూ డివిజన్‌లో వర్షపాతం వివరాలు

కనిగిరి రెవెన్యూ డివిజన్‌ పరిధిలోని 13 మండలాల్లో గురువారం 93.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 7.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కనిగిరి మండలంలో 18.4 మి. మీ, వెలిగండ్ల 2.0 మి.మీ, హెచ్‌ఎంపాడు 8.4 మి.మీ, పామూరు 3.4 మి.మీ, సీఎస్‌పురంలో 8.2 మి.మీ, వర్షపాతం నమోదు అయింది. అలాగే శుక్రవారం డివిజన్‌లో మొత్తం 210.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 16.2 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. కనిగిరిలో 30.6 మి.మీ, వెలిగండ్ల 2.4 మి.మీ, హెచ్‌ఎంపాడు 24.0 మి.మీ, పామూరు 7.0 మి.మీ, సీఎస్‌పురంలో 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన పొగాకు వేలం


వేలం ముగింపు ఉత్సవాల్లో నిర్వహణ అధికారి జి.సునీల్‌ కుమార్‌, వ్యాపారులు, రైతులు, సిబ్బంది.


వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి జి.సునీల్‌ కుమార్‌

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 2023–24 పంట కాలానికి పొగాకు అమ్మకాలు శుక్రవారంతో ముగిసినట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌ కుమార్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలం కేంద్రం పరిధిలో 3982 మంది పొగాకు సాగుదారులు, 2830 బ్యారన్లు ఉన్నాయన్నారు. 6,578 హెక్టార్లలో పొగాకు సాగు చేశారని, అందులో 10.13 మిలియన్ల కేజీల దిగుబడులు అంచనా వేయగా, 16.58 మిలియన్‌ కేజీలు వచ్చినట్లు చెప్పారు. విజిలెన్స్‌, స్వీపింగ్‌ పొగాకుతో సహా విక్రయించిన పరిమాణం 17.29 మిలియన్ల కేజీలుగా నమోదైనట్లు వివరించారు. సీజన్లో సగటు ధర కేజీ రూ.270 నమోదైందన్నారు. గత పంట సీజన్‌ తో పోలిస్తే ప్రస్తుత పంట సీజన్లో గుర్తించిన సగటు ధర రూ.52 అన్నారు. విక్రయించిన పొగాకు మొత్తం విలువ రూ.467 కోట్లు ఉందని చెప్పారు. ఆకు అమ్మకానికి వేలం రోజుల సంఖ్య 154, వేలం విక్రయాల్లో పాల్గొన్న కంపెనీల సంఖ్య 50, రోజుకు సగటున 873 బేళ్లు అమ్మినట్లు తెలిపారు. పొగాకు ఆకు, సురా, ముక్క, పండుగుల్ల అమ్మకాలు మొత్తం విలువ రూ.471 కోట్లు ఉందన్నారు. వేలం ముగింపు సందర్భంగా వేలం నిర్వహణ అధికారి జీ సునీల్‌ కుమార్‌ కు, కంపెనీ బయ్యర్లకు, బోర్డు సిబ్బందికి పొగాకు రైతులు సన్మానం చేశారు.

403 బేళ్ల కొనుగోలు

కొండపి: కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సూర, ముక్కకి సంబంధించి శుక్రవారం నిర్వహించిన వేలంలో 403 బేళ్లు కొనుగోలు చేసినట్లు కొండపి వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌ కుమార్‌ తెలిపారు. కామేపల్లి, పచ్చవ, అక్కచెరువు పాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు, చోడవరం, ముప్పవరం, చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 622 బేళ్లు వేలానికి తీసుకొచ్చారు. అందులో 403 బేళ్లను కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 219 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.135, కనిష్ట ధర రూ.30, సరాసరి ధర రూ.41.25 వేలంలో ఏడుగురు వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ర్యాలీలో ఎన్‌జీవో, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ కార్యకర్తలు

పామూరు: బాలికల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ గోళ్ల పద్మజ అన్నారు. పామూరుకు చెందిన స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్‌ నాయబ్‌ రసూల్‌ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బొట్లగూడూరులో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బాలికల సాధికారతను ప్రోత్సహించడం, మానవహక్కులు నెరవేర్చేవిధంగా దృష్టి సారించాలన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనే లక్ష్యంతో వారి విద్యతోపాటు రాజకీయ రంగంలో కూడా ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇచ్చాయన్నారు. బాలికలు సరోజినీ నాయుడు, సావిత్రిబాయిపూలేలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలు నేరమన్నారు. బాలికలు ఎలాంటి ఇబ్బంది వచ్చినా 1098 నంబర్‌కు ఫోన్‌ చేయాలని సూచించారు. బొట్లగూడూరులోని ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ మస్తాన్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎస్‌కే నాయబ్‌ రసూల్‌

కనిగిరి రూరల్‌: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాయబ్‌ రసూల్‌ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం యూనియన్‌ రాష్ట్ర కౌన్సిలర్‌ పి. రాజ్‌ కుమార్‌ అధ్యక్షతన సమావేశం జరిగింది. నాయబ్‌ రసూల్‌ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణ చర్యలు చేపట్టాలని, 12 పీఆర్‌సీ ప్రక్రియ చేపట్టాలని, 30 శాతం ఐఆర్‌ను చెల్లించాలని, 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర నాయకులు పి. రాజ్‌ కుమార్‌ మాట్లాడుతూ జీవో 53ను పునరుద్ధరించి, హేతు బద్ధీకరణ చేపట్టాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 212 నెలల డీఏ బకాయిలను చెల్లించాలని, సరెండర్‌ లీవ్లు, ఏపీజీఎల్‌ఐ లోన్లు, క్లోజర్లు పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ప్రతి హైస్కూల్‌కు హెచ్‌ఎం పోస్టులు తప్పని సరిగా ఉంచాలని, సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్‌ పునరుద్ధరణ చేయాలన్నారు. ఎయిడెడ్‌ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు ఒంగోలు వెంకటేశ్వర్లు, జి. రామకృష్ణ, పొట్టిండ్ల మాలకొండయ్య, హజరత్‌ రెడ్డి, పాకల శ్రీను, ఎస్‌వీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆమోదంతో పార్టీ ప్రక్షాళన


డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌

సింగరాయకొండ: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అందరి ఆమోదంతో పార్టీ ప్రక్షాళన త్వరలో చేపడతానని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ అన్నారు. జరుగుమల్లి మండలంలో శుక్రవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డాక్టర్‌ సురేష్‌ మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షునిగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి నియమితులవటంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. జిల్లాతో పాటు నియోజకవర్గంలో కూడా పార్టీ ప్రక్షాళన జరుగుతుందని తెలిపారు. అన్ని మండలాల్లో త్వరలో సమావేశాలు నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాలతో ఏకాభిప్రాయంతో అందరి ఆమోదంతో, పారదర్శకంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా మండల, జిల్లా స్థాయి పదవుల్లో ఎంపికలు జరుగుతాయని ఆయన వివరించారు.

కుక్కలు బాబోయ్‌ కుక్కలు


జండా చెట్టు సెంటర్లో రాత్రి వేళలో గుంపుగా ఉన్న కుక్కలు

కొండపి: నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో ఎక్కడ చూసినా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా కనబడుతున్నాయి. కొండపి జండా చెట్టు సెంటర్‌, కామేపల్లి సెంటర్‌, బస్టాండ్‌ సెంటర్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళలో వాహనదారులు ప్రయాణించాలంటే కష్టాలు తప్పడం లేదు. వాహనాల్లో వెళ్తుంటే కుక్కలు వెంబడిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్‌ కి వెళ్లే వారి వెంట కూడా పడుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కనిగిరి రూరల్‌: బాణసంచా విక్రయ దారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో దీపావళి సామగ్రి విక్రయదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు ముందస్తుగా పోలీస్‌, ఫైర్‌, మున్సిపాలిటీ శాఖల నుంచి పర్మిషన్లు తీసుకోవాలన్నారు. పండుగకు ముందే దీపావళి సామగ్రిని గూడెం.. ఇళ్ల మధ్య నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని, వారి పై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో, వ్యాపార సముదాయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. సమావేశంలో ఎస్సై టి. శ్రీ రాం, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పీసీపల్లి: మండల పరిధిలోని కస్తూర్బా పాఠశాలలో పనిచేసేందుకు ఒక స్వీపర్‌, ఒక అసిస్టెంట్‌ కుక్కు.. కోసం ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు సంజీవ్‌, శ్రీనివాసచారి ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులను నేరుగా అందజేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నలుగురు జూదరుల అరెస్ట్‌

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై ఆర్‌.సుమన్‌ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 3980 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

19 షాపులకు 388 దరఖాస్తులు

కనిగిరి రూరల్‌: కనిగిరి నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన 19 షాపులకు 388 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్‌ సీఐ ఆర్‌. విజయభాస్కర్‌రావు తెలిపారు. చివరి రోజైన శుక్రవారం నాడు 109 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

జరుగుమల్లిలో మాజీ మంత్రి సురేష్‌ పర్యటన


వావిలేటిపాడు లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని పలు కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ పాల్గొన్నారు. సతుకుపాడు లో పార్టీ నాయకుడు కసుకుర్తి మాల్యాద్రి కుమారుడు సంతోష్‌ వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వావిలేటిపాడులో పార్టీ సీనియర్‌ నాయకుడు పాలేటి రవి అన్న కుమారుడు బాలకృష్ణ వివాహ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. జరుగుమల్లి ఎస్సీ కాలనీలో అనారోగ్య కారణంగా మృతి చెందిన తగరం కోటయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సురేష్‌ మాట్లాడుతూ తాను పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బత్తిన మదన మనోహర్‌, పార్టీ బీసీ విభాగం జోన్‌–3 ఇన్‌చార్జి బొట్ల రామారావు, పాలేటి రవి, పిన్నిక శ్రీనివాసరావు, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, పాడిబండ్ల నాగేశ్వరరావు, జగదీష్‌, జేసీఎస్‌ కన్వీనర్‌ తాటికొండ రామచంద్రరావు, కనపర్తి శేషారెడ్డి, పుట్టా వెంకట్రావు, కొండయ్య తదితరులు ఉన్నారు.

పోస్టల్‌ వారోత్సవాలు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్‌ సిబ్బంది

కొండపి: పోస్టల్‌ శాఖలో ఉన్న పొదుపు పథకాల గురించి కొండపిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ పొదుపు ఎంత అవసరమో వివరిస్తూ, పోస్టల్‌ శాఖలో ఉన్న పొదుపు పథకాలను ప్రజల దగ్గరకు చేరవేసేలా పోస్టల్‌ శాఖ చేపట్టిన చర్యల గురించి వివరించారు. చీటీల వలన అగ్రిగోల్డ్‌ లాంటి ప్రైవేట్‌ సంస్థల్లో పొదుపు చేసి ప్రజలు ఎంత నష్టపోయారో తెలుసుకొని పోస్టల్‌ శాఖలో పొదుపు చేసి లాభాలు గడించాలని సౌత్‌ సబ్‌ డివిజనల్‌ అధికారి రవికుమార్‌ రెడ్డి ఖాతాదారులకు సూచించారు. పోస్టల్‌ శాఖ సిబ్బంది ప్రజలను చైతన్యపరచి పోస్టల్లో పొదుపు చేయించాలని సిబ్బందికి రవి కుమార్‌ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో కొండపి సబ్‌ పోస్ట్‌మాస్టర్‌ అశోక్‌ కుమార్‌ రెడ్డితో పాటు జీడీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

దేగా వారి వివాహ వేడుకల్లో దద్దాల


వెదుళ్లచెరువులో నూతన వధూవరులను ఆశీర్వదించిన దద్దాల

వెలిగండ్ల: మండలంలోని వెదుళ్లచెరువులో దేగా వెంకటేశ్వర్లు, వెంకటరత్నమ్మ కుమార్తె దేగా మౌనిక వివాహ వేడుకల్లో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జ్‌ దద్దాల నారాయణయాదవ్‌ శుక్రవారం పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, గిద్దా బ్రహ్మయ్య, చెరుకుపల్లి రమణారెడ్డి, సర్పు తిరపతయ్య, ముక్కు తిరుపతిరెడ్డి, మీరావళి, మితికాల నాగేశ్వరరావు, పరమేశ్వరరెడ్డి, తిరపతయ్య, సంపతి ఈశ్వరమ్మ, కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలురెడ్డి, ఆదినారాయణరెడ్డి, టి. నాని, గంజి రవీంద్ర, జేమ్స్‌, శివరామిరెడ్డి, సైకం శివారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సై సుమన్‌ను కలిసిన నేతలు


ఎస్సై సుమన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ, నాయకులు

సీఎస్‌పురం (పామూరు): సీఎస్‌పురం మండల నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆర్‌.సుమన్‌ను శుక్రవారం రాత్రి ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి సన్మానించారు. బైరెడ్డి తిరుపతిరెడ్డి, మైనారిటీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి షేక్‌ బుజ్జి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, పెరుగు సుబ్బరామయ్య, బొట్లా చిరంజీవి, మితికాల గురవయ్య, అద్దంకి రమణయ్య ఉన్నారు.

జిల్లా అధికార ప్రతినిధిగా ఏడుకొండలు


నియామక పత్రం అందుకుంటున్న ఓగూరి ఏడుకొండలు

పామూరు: జాతీయ బీసీ చైతన్య సమితి ప్రకాశం జిల్లా అధికార ప్రతినిధిగా పామూరుకు చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకులు ఓగూరి ఏడుకొండలు నియమితులయ్యారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అంకాళమ్మ దేవస్థానం వద్ద జాతీయ బీసీ చైతన్య సమితి సమావేశం జరిగింది. జాతీయ బీసీ చైతన్య సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తల మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు అంతా ఐకమత్యంతో ఉండాలన్నారు. లక్కనబోయిన ప్రసాద్‌, ఓగూరి శివ, బత్తుల నాగేశ్వరరావు, వి.మల్లికార్జున, టి.నాగయ్య, వాసు, బాబు, మల్లయ్య ప్రసాద్‌, వెంకటస్వామి, నాగయ్య, చెందు పాల్గొన్నారు.

కూతురు మరణం కేసులో రిమాండ్‌


చిన్నారి ఒమైరా మృతదేహానికి శవపంచనామా చేస్తున్న దృశ్యం

సింగరాయకొండ: ఓ తండ్రి.. తన కన్నకూతురి మృతికి కారణమై జైలు పాలయ్యాడు.ఈ ఘటనలో అతని తల్లిదండ్రులు కూడా కటకటాలు లెక్కిస్తున్నారు. చిన్నారి గత నెల 27వ తేదీ మృతి చెందగా.. ఈనెల 3వ తేదీ చిన్నారికి పోస్టుమార్టం నిర్వహించారు. 5వ తేదీ ఈ ముగ్గురిని కోర్టుకు హాజరు పరచగా జడ్జి రిమాండ్‌ విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని డ్రైవర్‌పేట–2వ లైనులో నివసిస్తున్న షేక్‌ మహబూబ్‌ బాషా, సుల్తాన్‌బీ దంపతుల కుమారుడు సంధాని బాషా 2022 నవంబరులో పాకల గ్రామానికి చెందిన షేక్‌ రషీదాను రెండో వివాహం చేసుకున్నాడు. మహబూబ్‌బాషా ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. కుమారుడు సంతానంగా కలగకపోవడంతో మొదటిభార్యకు విడాకులు ఇచ్చాడు. రషీదా వివాహం సంవత్సరానికే ఆడపిల్లను ప్రసవించింది. దీంతో ఆమె భర్త, అత్త, మామలు శారీరకంగా, మానసికంగా హింసించడం ప్రారంభించారు. కాగా రషీదా 7వ నెల రాగానే మరో పాపను ప్రసవించింది. పాపకు పలు రకాల ఆరోగ్య సమస్యలు, పుట్టుక లోపాలున్నాయి. కానీ కొద్దిరోజులకే పాప అనారోగ్య సమస్యలతో మరణించింది. దీంతో తన పాప ఓమైరా చనిపోవటానికి తన భర్త, అత్తా, మామలే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సీహెచ్‌ హజరత్తయ్య ఆధ్వర్యంలో ఎస్సై బి. మహేంద్ర కేసు రిజిష్టరు చేశారు. పాప శవానికి పంచనామా నిర్వహించారు.